క్లుప్తంగా

పరీక్షలపై భయం పోగొట్టేందుకు కౌన్సెలింగ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు గోవిందరాజు

ఉంగుటూరు: స్థానిక కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షా పర్వ్ 4.0 కార్యక్రమాన్ని దూబచర్ల డైట్ కళాశాల లెక్చరర్ సీహెచ్ గోవింద రాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. మంచి మార్కుల సాధనకు సులువైన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. పరీక్షలంటే ఉండే భయాన్ని పోగొట్టడానికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి వి కన్నారావు, జి.గవరయ్య, సాయిరాంబ, వి.గంగాధరలు పాల్గొన్నారు.

చేబ్రోలు శివారుల్లో కంకర తవ్వకాలు



చేబ్రోలు శివారుల్లో కంకర తవ్వి తరలిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చేబ్రోలు శివారు ప్రాంతంలో కంకర అక్రమంగా తవ్వి లారీల్లో తరలిస్తున్నారు. రెండు రోజుల్లో 500 లారీల్లో కంకర తరలించినట్లు సమాచారం. తోకలపల్లి కోడు గట్టును ఆనుకుని మట్టి తవ్వకాలు చేస్తున్నట్టు స్థానికులు తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికార్లు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

నవజాత శిశువు మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక అంబికా రెస్టారెంట్ రోడ్డులో హైదరాబాద్‌లో నివశిస్తున్న సురేష్‌కు చెందిన శిథిలావస్థలో చేరిన ఇంట్లో నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించారు. సురేష్ హైదరాబాద్‌లో ఉండటంతో రెండేళ్లుగా ఆ ఇల్లు ఖాళీగా ఉంది. శుక్రవారం సురేష్ వచ్చి ఇంటి ఆవరణను శుభ్రం చేస్తుండగా వంట గదిలో వాష్ బేసిన్‌లో కుళ్లిన నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుళ్లిన నవజాత శిశువు మృతదేహాన్ని 10 రోజుల క్రితం పడవేసి ఉంటారని భావిస్తున్నారు. ఘటనపై చుట్టుపక్కల వారి నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బ్యాంకు ఖాతాదారులకు సత్కారం

పోలవరం రూరల్: బ్యాంకు సేవల వినియోగదారులకు సంధ్యా శిబిరాల అవగాహన ఎంతో అవసరమని భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాజశేఖరం అన్నారు. గురువారం ఎస్‌బీఐ పోలవరం వ్యవసాయ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా పోలవరం మండలం గుంజవరం, చేగొండపల్లిలో ప్రజలకు, డ్వాక్రా మహిళలకు, బ్యాంక్ సేవల వినియోగదారులకు సంధ్యాశిబిరం నిర్వహించారు. పోలవరం బ్రాంచ్ మేనేజర్ ఎస్.నవీన్‌కుమార్ ఉత్తమ రైతులను, రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులను ఘనంగా సన్మానించారు.

పన్ను వసూలు

జంగారెడ్డిగూడెం: పన్నుల వసూళ్ల కార్యక్రమం ఐదో రోజు జంగారెడ్డిగూడెం పట్టణంలో కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ మాట్లాడుతూ మొండి బకాయిదారుల ఇంటికి వెళ్లి పన్నుల విషయం తెలిపి, చెల్లించాలని కోరారు. దీనికి స్పందించిన బకాయిదారులు రూ. 12లక్షలు నగదు రూపంలో, రూ. 2లక్షలు చెక్కు రూపంలో పన్నులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

పెదవేగి: బలివే రామలింగేశ్వరస్వామి పూజలు అందుకునేందుకు సిద్ధమయ్యారు. భారీ ఏర్పాట్లకు నాయకులు, అధికారులు పగలు రాత్రి శ్రమించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేసే భక్తుల సౌకర్యార్థం, పార్కింగ్ స్థలం నుంచి, పూజలు, పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో అల్పాహార స్టాల్స్ ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించారు. ట్రాఫిక్ నియంత్రణకు, ప్రథమ చికిత్స కేంద్రాలు సైతం శుక్రవారం సాయంత్రం నుంచే ప్రారంభించారు. ఈ ఏడాది భారీ సంఖ్యలో భక్తులు క్షేత్రానికి వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

50 వేల మందికి ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు

మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఏలూరు జిల్లా బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు పెదవేగి మండలం విజయరాయిలోని బలివే అడ్డరోడ్డు వద్ద తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి చౌదరి ఆధ్వర్యంలో భారీ ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చి స్వామి దర్శనం చేసుకుని వెళ్లే భక్తులకు ప్రత్యేకంగా బ్రాహ్మణులతో మూడు రకాల ప్రసాదాలను వండించి 50 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, మజ్జిగ ప్యాకెట్లను, మంచినీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేశామని గారపాటి చౌదరి చెప్పారు. బలివే తోపాటు పట్టిసీమ, తాడువాయి, కలిదిండిలోనూ భక్తులకు తపన ఫౌండేషన్ తరపున ప్రసాద వితరణ, మజ్జిగ ప్యాకెట్లను అందించనున్నట్టు గారపాటి చౌదరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.



బలివే రామలింగేశ్వరుడు



ఉంగుటూరు భీమేశ్వరస్వామి



భీమడోలులో పురాతన ఆలయాన్ని పువ్వులతో అలంకరించిన దృశ్యం

భక్తుల రద్దీ దృష్ట్యా ముమ్మరంగా ఏర్పాట్లు

భీమడోలు: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాలు వైభవంగా ముస్తాబయ్యాయి. ఐదు రోజుల పాటు శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగనున్నాయి. శనిత్రయోదశి, మహా శివరాత్రి పర్వదినాలు ఒకేసారి రావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నందున అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేసారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట, పోలసానిపల్లి తదితర గ్రామాల్లోని ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈనెల 18న శనివారం నుంచి ఐదో రోజుల పాటు ఆలయాల్లో స్వామి వారికి విశేష పూజలు, అభిషేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేసారు.

శివ పూజకు వేళాయె..

దెందులూరు: మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని శివాలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. చల్లచింతలపూడిలో ప్రాచీన మేధాదక్షిణామూర్తి ఆలయంలో స్వయంభూగా పరమశివుడు కొలువైనట్టు స్థలపురాణం చెబుతోంది. ఈ నెల 18 నుంచి 5 రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. దెందులూరు శివాలయం, జోగన్నపాలెం శివాలయం, దోసపాడు, పోతునూరు శివాలయాల్లో ఉత్సవాల నిర్వహణకు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

శివరాత్రికి భీమేశ్వరాలయం సిద్ధం

ఉంగుటూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉంగుటూరులో భీమేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. శైవ క్షేత్రాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. నీడ కోసం పందిర్లు వేశారు. ఆలయ ఈవో కలగర శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఉత్సవాలు ఏర్పాటు చేశారు. శివారాత్రి సందర్భంగా ఆలయానికి రంగులుదిద్ది , విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాలవాసు బాబు వస్తారని ఆలయ ఈవో తెలిపారు.

వైభవంగా భీమేశ్వరుని కల్యాణం

ఉంగుటూరు: గ్రామంలో పార్వతీ,భీమేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో కల్యాణంలో పాల్గొన్నారు. ముందుగా స్వామిని పల్లకి పై ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, మండపారాదన, వాస్తుపూజ ధ్వజారోహణము ,బలిహరణ పూజలు జరిపారు. సాయంత్రం 6గంటలకు కల్యాణం నిర్వహించారు. అలాగే చేబ్రోలు , గొల్లగూడెం, కంసాలిగుంట, కైకరం, రాచూరు, కాగుపాడు, బొమ్మిడి, బాదంపూడి, నాచుగుంట శివాలయాలు భక్తులు దర్శనానికి సిద్ధం చేశారు.



దెందులూరులో విద్యుద్దీపాలంకరణతో ముస్తాబైన శివాలయం



ఉంగుటూరు భీమేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



బలివేలో క్యూలైన్ ఏర్పాట్లు

బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత

గణపవరం: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఐసీడీఎస్ గ్రేడ్–1 సూపర్ వైజర్ పి.తులసి తెలిపారు. శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీ వద్ద బాల్య వివాహాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం స్థానిక యూపీ స్కూల్లో 8, 7వ తరగతి విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహాలకు ఎవ్వరైనా హాజరైతే ఆయా ఫోటోలు ఆధారంగా ఫోటో ఉన్న అందరి మీద కేసులు నమోదు చేస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి పి. సరళ హెచ్చరించారు. రెండేళ్ల వరకూ జైలు, లక్ష వరకూ జరిమానా, వివాహం రద్దు చేస్తు కోర్టు ఇన్‌జక్షన్ ఆర్డర్ ఇచ్చిన సందర్భాలున్నాయని వివరించారు. చిన్న వయసులో వివాహాలు జరగడ వల్ల చదువులు నిలిచిపోవడమే కాకుండా అనేక ఆరోగ్య సమస్యలు పిల్లలు ఎదుర్కొవలసి ఉంటుందని ఉపాధ్యాయుని పి.సౌజన్య అన్నారు. హెచ్ఎం కెటి సుందరకుమార్, వెల్ఫేర్ సహాయకులు బుద్దాల శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ కవిత, ఏఎన్ఎం కనకమహాలక్ష్మి, కళ్యాణి బుజ్జి, ఆశా వర్కర్లు విజయ కుమారి, శిరీష, దైవ కుమారి, టీచర్లు తదితరులున్నారు.



జల్లికొమ్మర యూపీ స్కూల్లో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దెందులూరు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈగా శ్రీనివాస్

దెందులూరు: విద్యుత్ శాఖ దెందులూరు ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్‌గా తంగెళ్ళమూడి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు దెందులూరు అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేసిన ఎం.రమేష్‌బాబు ఇటీవల ఏసీబీ దాడిలో పట్టుబడిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు శ్రీనివాస్‌ను నియమించారు.

ఆర్థిక సాయం అందజేత

పెదపాడు: మండలంలోని ఏపూరు ఆదిత్య బధిరుల పాఠశాల నిర్వహణార్థం రూ.5,101 ఆర్థిక సహాయం అందించినట్లు మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. ఏపూరులో శుక్రవారం నిర్వహించిన మానవత అప్పనవీడుశాఖ సమావేశంలో దాత కొణిజేటి వెంకటేశ్వరావు అందించిన రూ.5,101 పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందించారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఉంగుటూరు: విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్ఎఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యాబోధనలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న కంప్యూటర్ లాబ్‌ను, ఈ క్లాస్ రూమ్, వర్చువల్ క్లాస్ రూమ్, రసాయన శాస్త్ర, జంతు శాస్త్ర, బౌతిక శాస్త్ర, వృక్షశాస్త్ర ప్రయోగశాలలను, అందులో ఉన్న అధునాతన పరికరాలను విద్యార్థులకు చూపించారు. స్కిల్ కోర్సులు గురించి, లైఫ్ స్కిల్ కోర్సు గురించి విద్యార్థులకు వివిధ విభాగాల అధ్యాపకులు వివరించారు. జూనియర్ కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు

వ్యాయామ కళాశాలలో రక్తదాన శిబిరం

దెందులూరు: అన్ని దానాల్లో కన్నా రక్తదానం మిన్న అని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ హేలాపురి, ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకుల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వ్యాయామ శిక్షణా విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా సేకరించిన రక్తాన్ని తలసేమియా, రోడ్డు ప్రమాదాలు, రక్తం కోల్పోయిన నిరుపేదలు, రక్తం కోల్పోయిన గర్భిణులకు అందజేస్తామన్నారు. రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చని ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు బీ. గణేష్, వీ.బాబు, వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్‌ఓ రమణ, వైస్ ప్రిన్సిపల్ పీవీకేడీ ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ ఎం.మనోహర్, డాక్టర్ శ్యామల తదితరులున్నారు.



గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

భక్తులకు అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు

దెందులూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బలివేలో భక్తులకు అల్పాహార పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదవేగి మండలం విజయరాయి సరిహద్దులోని బలివే గ్రామంలోని బలివే రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉచితంగా అల్పాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని తెలిపారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి



నాయుడుగూడెంలో హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పెదపాడు తహసీల్దార్ జీవిజయకుమార్ రాజు

పెదపాడు: స్థలం పొందిన లబ్ధిదారులంతా తప్పనిసరిగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెంలో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడారు. మండల సమాఖ్య ద్వారా రూ.35వేలు అందిస్తున్నట్లు చెప్పారు. పునాదుల వేయడానికి ముందుగానే నిర్మాణ సామగ్రి అందిస్తున్నట్లు చెప్పారు. గృహనిర్మాణానికి అవసరమైన ఇనుము, ఇసుక, సిమెంటుతోపాటు ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సామాగ్రి సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఈకార్యక్రమంలో పెదపాడు ఏపీఎం దాసరి సుమలత, ఏఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ చైతన్య, పంచాయతీ కార్యదర్శి ధర్మగోవిందు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కృషి



ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ముస్లిం సోదరులు

నిడమర్రు: జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా బువ్వనపల్లి గ్రామానికి చెందిన రామతుల్లా నియామకంపై గణపవరం, నిడమర్రు మండలాల ముస్లిం పెద్దలు హర్షం వ్యక్తం చేసారు. శుక్రవారం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును కలిసి ముస్లిం పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్ షేక్ రామతుల్లా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు పుష్పగుచ్చం, శాలువతో సత్కరించి మాట్లాడారు. జిల్లాలో అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణలో జిల్లా బోర్డుతో కలిసి దృష్టి సారించి వాటి సంరక్షణకు కృషి చేస్తానన్నారు. మసీదుల్లో, దర్గాల్లో మరుగుదొడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం బిలాల్ మసీదు ముతవల్లి ఎండీ ఇస్మాయిల్, అధ్యక్షుడు ఎండీ షాజహాన్, ట్రెజరర్ నాగూర్, కార్యదర్శి బదురుద్దీన్, జమాత్ అబ్దుల్ గఫూర్, ఎండీ బషీర్, మసీదు ముతవల్లి ఎండీ ఇస్మాయిల్, షేక్ హుస్సేన్ తదితురులున్నారు.

మోతాదు మించి పురుగు మందులు వాడొద్దు



నడిపల్లిలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, రైతులు

పెదవేగి : పెదవేగి మండలం నడిపల్లిలో పొలంబడి కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఫణి, మండల వ్యవసాయ అధికారిని ప్రియాంక రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్త ఫణి మాట్లాడుతూ పంటలపై మోతాదు మించి పురుగు మందులు, రసాయన ఎరువులు వాడడం వల్ల రైతుకు సాగు ఖర్చు పెరగడంతో పాటు వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందని తెలియజేశారు. వరి పొలాలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలు సూచించారు. కాండంతొలుచు పురుగు సోకిన పొలంలో అవసరమైతే ఎసిఫేట్ 1.5 లేదా కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ 2జి లేదా క్లోరంట్రానిలిప్రోల్ 1.3 ఎంఎల్ నీటితో కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారులు వివరించారు.

ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలి

కొయ్యలగూడెం: చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ నాయ కులు కోరారు. శుక్రవారం మండలంలోని మంగపతి దేవీపేటలో చింతపూడి ఎత్తిపోతల కాలువ పనులు నిర్వహించే ప్రదేశంలో వారు నిరసన తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ అబ్బు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.